# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 04 అక్టోబరు , 2026 | పేజీలు : 5




వివరాలు మెయిన్‌లో

**ప్రజల పక్షాన పనిచేసే జర్నలిజం అవసరం**

# సీజ్ చేసిన ఇసుక మాయం!?

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం...
ఇసుక డంప్‌లకు భద్రత కరువు
మాయం చేస్తున్న ఇసుక మాఫియా

**ప్రజాపక్షం/సూర్యాపేట** : అక్రమ ఇసుక రవాణాను అడ్డుకట్ట వేసేందుకు మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు గత నెల 26వ తేదీన విస్తృతంగా తనిఖీలు చేసి అక్రమంగా డంప్ చేసిన (నిల్వ) ఇసుకను పెద్దఎత్తున సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక డంప్‌లను రెవెన్యూ అధికారులు స్థానికంగా ఉన్న గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ రాజ్ కార్యదర్శులకు, విఆర్‌ఏలకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. సూర్యాపేట మండల పరిధిలోని మండలంలోని కాసరబాదలో 175 ట్రిప్పులు, కెటిఅన్నారంలో 100 ట్రిప్పులు, పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారంలో 20 ట్రిప్పులకు పైగా అధికారులు సీజ్ చేసిన విషయం అందరికి తెలిసిందే. ఇలా సీజ్ చేసిన ఇసుక విలువ దాదాపు రూ.15లక్షలకు పైగా విలువ ఉంటుంది. అధికారులు సీజ్ చేసిన ఇసుక డంప్‌లకు భద్రత కరువైంది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో గతంలో కూడా జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంలో సీజ్ చేసిన ఇసుక డంప్‌లు పెద్దఎత్తున మాయమైపోయాయి. సూర్యాపేట మండలంలోని యండ్లపల్లి గ్రామంలో ఇలా జరిగిన విషయం అధికారులకు తెలిసినా అప్పట్లో ఏ చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వానికి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. సీజ్ చేసిన ఇసుక డంప్‌లను అమ్మకానికి రెవెన్యూ అధికారులు వెంటనే వేలం వేయాల్సి ఉంది. లేదా ప్రభుత్వ నిర్మాణ పనులకు ఈ ఇసుకను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండగా తీవ్ర జాప్యం చేస్తుండడంతో స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది రోజుల తరబడి కాపలా ఉండలేక చేతులెత్తేస్తున్న పరిస్థితి. పెన్‌పహాడ్, సూర్యాపేట మండలాల్లో అధికారులు ఇటీవల సీజ్ చేసిన ఇసుక డంప్‌లను మాఫీయా మాయం చేసినట్లు తెలిసింది. నాగులపాటి అన్నారంలో సీజ్ చేసిన డంప్‌ను మాయం చేసేందుకు ఇసుక మాఫియా ప్రయత్నించగా అడ్డుకున్న స్థానిక సర్పంచ్, గ్రామస్థాయి అధికారులపై రెండు రోజుల క్రితం గొడవకు దిగిడం చర్చనీయాంశంగా మారింది. సూర్యాపేట మండలంలోని కాసరబాద, కెటిఅన్నారంలో సీజ్ చేసిన ఇసుక డంప్‌ల్లో కొంత భాగం అధికార పార్టీ నాయకుల అండతో మాఫియా కాజేసినట్లు తెలిసింది. రెవెన్యూ అధికారులు ఇలానే నిర్లక్ష్యం చేస్తే సీజ్ చేసిన రూ.15లక్షల విలువైన ఇసుక ఈసుమంత కూడా ఉండదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు హడావుడి చేసి సీజ్ చేసి ఏం ప్రయోజనమని ప్రజలను మభ్యపెట్టేందుకే తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటున్నారు తప్ప ప్రయోజనం ఏమిలేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సీజ్ చేసిన ఇసుక డంప్‌లను వేలం ద్వారా అమ్మకాలు జరిపి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చాలని లేదా ప్రభుత్వ నిర్మాణ పనులకు దీనిని ఉపయోగించాలని కోరుతున్నారు.



(ఫైల్ ఫోటో)




## ప్రమాదాలు జరిగే ప్రాంతాలపై దృష్టి

### రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ** : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.నేషనల్ హైవేలపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్, క్రేన్,హెల్పర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని,26 మంది అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ నిరంతరం రోడ్డు భద్రతను పర్యవేక్షించాలని సూచించారు.మిర్యాలగూడనందిపాడు,చిట్యాలనార్కట్‌పల్లి,కొండమల్లేపల్లి, ఆలగడప,డిండి, కొండమల్లేపల్లి,నార్కట్‌పల్లి, వాడపల్లి మార్గాల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని,దామరచర్ల రైల్వే బ్రిడ్జి వద్ద లైటింగ్, కట్టంగూర్ పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్‌హెచ్65పై ఆక్రమణల తొలగింపు, సీసీ కెమెరాల ఏర్పాటు,కంట్రోల్ రూమ్ ఏర్పాటు, ట్రామా కేర్ సెంటర్లకు సీఎస్ఆర్ నిధుల వినియోగంపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలోకి లారీల రాకపోకలకు సమయపాలన, ఎన్‌హెచ్65పై డాబాల వద్ద లారీల నిలుపుదల నివారణకు యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 30 బ్లాక్‌స్పాట్లు ఉన్నాయని, వాటిని తగ్గించేలా ప్రణాళిక అమలు చేస్తామన్నారు.ఈ సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీవాణి,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, జాతీయ రహదారులు,ఆర్‌అండ్‌బీ,పంచాయతీరాజ్,ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు

## రైతులకు ఇబ్బందులు కలగొద్దు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ఖరీఫ్ 2026/27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 352 ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించగా, 267 కేంద్రాలను మొదటి దశలో ప్రారంభించేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. మొదటి దశలో ప్రారంభించే కేంద్రాల్లో మౌలిక వసతులు, తూకం, నాణ్యత పరీక్ష, గన్నీ సంచులు, టార్పాలిన్లు, హమాలీలు, రవాణా, నిల్వ తదితర ఏర్పాట్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తూకం యంత్రాలు, తేమ మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, గన్నీ సంచులు, టార్పాలిన్లు, హమాలీలు తదితర సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రైతులకు అవసరమైన మేరకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం నిర్ధేశించిన ఎఫ్‌ఏక్యూ నాణ్యతా ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రైతులకు టోకెన్ల జారీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కొనుగోళ్లు, నాణ్యత పరీక్ష, తూకం, రవాణా, గోదాం నిల్వ, ఓపిఎంఎస్ నమోదు, రైతులకు చెల్లింపులు తదితర అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా పౌరసరఫరాల అధికారి వి. మోహన్ బాబు, జిల్లా మేనేజర్ వి. శ్రీధర్ రెడ్డి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్ కుమార్, జిల్లా సహకార సూపరింటెండెంట్ కె. అంజయ్య, ఏఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లైస్ అసిస్టెంట్ మేనేజర్ బెన్నర్జీ, డిఎంఎస్/ఎంఇపిఎంఏ రమేష్ నాయక్‌తోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేముల వీరేశంను కలిసిన సర్వోత్తమ్‌రెడ్డి



**ప్రజాపక్షం/నకిరేకల్** : ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను ఖమ్మంనల్లగొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి శనివారం నకిరేకల్ పట్టణంలో క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డికి వీరేశం శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి నియోజకవర్గంలోని పట్టభద్రులను కలిసి మద్దతు కోరుతామని, అత్యధిక మెజార్టీ సాధించేలా పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేస్తాయని పేర్కొన్నారు.పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే వేముల వీరేశంకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి,పిఏసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు,కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు గాదగోని కొండయ్య, లింగాల వెంకన్న పాల్గొన్నారు.

## అండర్ డెనేజీ పనుల పేరుతో అవస్థలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ వారు సూర్యాపేట మున్సిపాలిటిలో గత కొంత కాలంగా చేస్తున్న అండర్ డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి. పైపులైన్ కోసం జెసిబిలతో తీసిన గుంతలు పైపులైన్లు వేసిన తరువాత పూడ్చుడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోజులతరబడి తీసిన గుంతలను పూడ్చకుండా అలానే వదిలేస్తుండడంతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రమాదాలకు గురై కాళ్లు చేతులు విరగొట్టుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. పైపులైన్ వేసి పూడ్చిన తరువాత మధ్యలో, ఇండ్ల సమీపంలో వేసిన మ్యాన్‌హోల్స్ మూతలు వేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చిన్నారులు అందులో జారిపడితే ప్రాణాలకు ముప్పు జరిగే అవకాశాలు ఉన్నాయి. పట్టణంలోని 47వ వార్డుతోపాటు అనేక వార్డులు లోతట్టు ప్రాంతాలు ఉండడంతో చిన్న వర్షానికే వీధుల్లో మోకాలు లోతు నీరు రోడ్లపైకి వచ్చి చేరుతుండడంతో మ్యాన్‌హోల్స్ మృత్యు రూపంలో తెరుచుకొని ఉంటున్నాయి. దీనికి తోడు అధికారులు చేస్తున్న పనుల్లో నాణ్యతా లోపాలు కంటికి కొట్టొచ్చినట్లు కనపడుతున్నా పట్టించుకున్న నాథుడు లేరు.



## జిల్లా జట్టుకు దాగూర్ బాలికలు

ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన దాగూర్ పాఠశాల విద్యార్థినిలు అండర్ 14 విభాగంలో కబడ్డీ క్రీడకు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పెద్ది నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకొండలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఎస్‌జిఎఫ్ కబడ్డీ పోటీలలో పాఠశాలకు చెందిన 8వ తరగతి బాలికలు పి ఐశ్వర్య, సిహెచ్ అక్షరలు నకిరేకల్ నియోజకవర్గం జట్టుకు ప్రాతినిధ్యం వహించి నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక కావడం పట్ల కరస్పాండెంట్ పెద్ది నరేందర్, పిఈటి ఎన్ లింగస్వామి, ఉపాధ్యాయ బృందం అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, చిట్యాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## క్రీడలతో స్నేహభావం పెంపు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: క్రీడలతో ఇరువర్గాల మధ్య స్నేహభావం పెంపొందుతుందని హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఉన్నత పాఠశాలలో గంజాయి నిర్మూలనకు మద్దతుగా ఆదివారం హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, అడ్వకేట్ల ఫ్రెండ్లీ క్రీడా పోటీల కరపత్రాన్ని ఆయన శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. క్రీడాకారులు నైపుణ్యాన్ని వెలికితీయడానికి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. జర్నలిస్టులు, అడ్వకేట్లు పేరు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చలిగంటి నరేష్, టోర్నమెంట్ కన్వీనర్ మోర్తాల నాగిరెడ్డి, జర్నలిస్టులు కోలా నాగేశ్వరరావు, దుగ్గి ఉపశ్రీ, దొంతగాని రాజా రమేష్, నక్క నరేష్ పాల్గొన్నారు.

## పిల్లల ఎదుగుదల లోపాలను తల్లిదండ్రులు గుర్తించాలి

ప్రజాపక్షం/గుండాల; పిల్లల మానసిక ఎదుగుదల లోపాలను తల్లులు గుర్తించాలని, తల్లులు, పిల్లల విషయంలో పూర్తి అవగాహనతో మసులుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ యాక్‌పాషా బేగం అన్నారు. శనివారం మరిపడిగ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ మహ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో గర్భిణిలు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధు, ఏఎన్ఎం రేణుక, అంగన్‌వాడీ టీచర్లు కలమ్మ, స్వరూప, ఆశాలు భాగ్యమ్మ, కళమ్మ, గర్భిణిలు పాల్గొన్నారు.



## గరిడేపల్లి సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన ఎల్‌బినగర్ రైతులు



ప్రజాపక్షం/గరిడేపల్లి: వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా రోజుకు 12 గంటల విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గరిడేపల్లి మండల కేంద్రంలోని 33కెవి సబ్‌స్టేషన్‌ను ఎల్‌బినగర్ రైతులు శనివారం ముట్టడించారు. గత మూడు రోజులుగా వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరాకావాల్సి ఉండగా కేవలం రెండు గంటలు మాత్రమే కరెంట్ ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలకు సాగునీరు అందించేందుకు విద్యుత్ కోసం ఎదురుచూస్తున్న సమయంలో అరకొర సరఫరాతో మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదని రైతులు వాపోయారు. ఇప్పటికే పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కారణాలు ఏంటో అధికారులు స్పష్టంగా చెప్పాలని, ఇకపై కోతలు లేకుండా వ్యవసాయానికి నిర్ణిత సమయం మేరకు విద్యుత్ అందించాలని రైతులు కోరారు.

## గరిడేపల్లిలో బైక్ దొంగల ముఠా అరెస్టు

**మూడు లక్షల విలువైన 9 బైకులు స్వాధీనం**



ప్రజాపక్షం/గరిడేపల్లి: విలాసవంతమైన జీవితం, వ్యసనాలకు బానిసై బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను గరిడేపల్లి పోలీసులు చాక్యచక్యంగా వ్యవహరించి పట్టుకున్నారు. నిందితుల నుంచి సుమారు మూడు లక్షల విలువైన 9 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు హుజూర్‌నగర్ సిఐ చరమం దరాజు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. మునగాల మండలం కలకోవ గ్రామానికి మండవ శివశంకర్ గత నెల 29న కీతవారిగూడెంలోని తన మామ ఇంటి ముందు పార్కు చేసిన హెచ్‌ఎఫ్ డీలక్స్ బైకు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ సిబ్బందితో కల్మల్‌చెర్వు క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా మిర్యాలగూడెం వైపు బైకుపై వెళ్తున్న ఇద్దరు యువకులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు గరిడేపల్లికి చెందిన తోకల మధు, తమిళనాడుకు చెందిన క్షేమ మురుగేష్‌కుమార్ గా గుర్తించారు. వీరితో పాటు పొనుగోడు గ్రామానికి చెందిన బైకు మెకానిక్ షేక్ జానిపాషా, అప్పన్నపేటకు చెందిన ఓ మైనర్ బాలుడు కలిసి ముఠాగా ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. గత జూన్ నుంచి సూర్యాపేట, మిర్యాలగూడెం, దామరచర్ల, రామన్నపేట, నార్కట్‌పల్లి, కీతవారిగూడెం తదితర ప్రాంతాల్లో తొమ్మిది బైకులు చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారని సిఐ తెలిపారు. చోరీ చేసిన బైకులను జానిపాషాకు ఇచ్చి మరమ్మతులు చేయించి విక్రయించి, వచ్చిన డబ్బును పంచుకునేందుకు పథకం వేసుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి తొమ్మిది బైకులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సిఐ వెంట ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, రైటర్ నాగేశ్వరరావు, ఏఎస్ఐ గౌరిశంకర్, సిబ్బంది నగేష్, ప్రశాంత్, సురేష్, రవీందర్, కరుణాకర్ పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సమాజంలో శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి చెందాలంటే సైన్స్ ప్రచారం, వాస్తవికత ప్రచారం విస్తృతంగా జరగాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పిల్లల చదువులు ప్రశ్నించే దిశగా, పరిశోధనల వైపు సాగాలని తెలిపారు. ఆధారాలను అన్వేషిస్తూ అధ్యయనం చేసినప్పుడే శాస్త్రీయ విద్య సాధ్యమవుతుందన్నారు. సైన్స్, వాస్తవికత, అభ్యుదయ భావాలు ఉన్నవారు జన విజ్ఞాన వేదిక వైపు నడవాలని, సంస్థ బలోపేతానికి మండల బాధ్యులు కృషి చేయాలని సూచించారు. అనంతరం జెవివి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతి ఏటా పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ నాయకులు పాదూరి రమణారెడ్డి, పారెపల్లి సత్యనారాయణ రావు మాట్లాడుతూ సైన్స్ ప్రచారంలో భాగంగా చెకుముకి చందాదారులుగా చేరాలని కోరారు. ఈ మహాసభల్లో వివిధ మండలాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడిగా పాదూరి రమణారెడ్డి, మిర్యాలగూడ అధ్యక్షుడిగా మల్లిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ వెంకటేశ్వర్లు, వేములపల్లి మండల అధ్యక్షుడిగా పర్సనబోయిన ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గుండగాని ఉపేందర్, దామరచర్ల మండల అధ్యక్షుడిగా ఎల్.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, మాడుగులపల్లి మండల అధ్యక్షుడిగా బండారు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా భీమనపల్లి రమేష్, అడవిదేవులపల్లి మండల అధ్యక్షుడిగా ఎల్.లోక్యానాయక్, ప్రధాన కార్యదర్శిగా రాజ్యలక్ష్మి, త్రిపురారం మండల అధ్యక్షుడిగా మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగా మోతిలాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : మండల కేంద్రంతోపాటు దుపహాడ్ గ్రామంలో ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూముల భుజంగ రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన పేద, మధ్య తరగతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పెన్‌పహాడ్, దూపహాడ్, చెట్లముకుందాపురం గ్రామ సర్పంచ్‌లు ఒగ్గు రవి, నన్నెపంగ కమలమ్మ సైదులు, పొనుగోటి నరేందర్, ఆర్‌ఐ రంజిత్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు నాగరాజు, స్వప్న, జిపిఓ సంధ్య, మాజీ జడ్‌పిటిసి పిన్నమనేని కోటేశ్వరరావులతోపాటు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## పిఆర్‌సి రిపోర్ట్ వెంటనే అమలు చేయాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు రెండు డీఏలు ప్రకటించడం స్వాగతించదగిన విషయమైనప్పటికీ వాటి చెల్లింపులను ఏకమొత్తంగా విడుదల చేయాలని తెలంగాణ ప్రావిన్షియల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టాప్రా) జిల్లా అధ్యక్షులు నూకల జగదీష్‌చంద్ర డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 సంవత్సరంలో నియమించబడిన వేతన సవరణ కమిటీ తన నివేదికను తయారుచేసి సిద్ధంగా ఉంచినట్లు అనేక కథనాలు వస్తున్నప్పటికీ, ఆ పిఆర్సీ రిపోర్టును ప్రభుత్వం వెంటనే తెప్పించుకుని అమలు చేయకపోవడం విచారకరమన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరల వల్ల ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందిపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి ఉన్న డీఏలను, పిఆర్సి నివేదికను వేగవంతంగా పరిశీలించి ఉద్యోగ ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగ వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ, కృష్ణమూర్తి, రమణారెడ్డి, సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: విద్యుత్ షాక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాంగ్రెస్ నాయకుడిని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పరామర్శించారు. శనివారం మండలంలోని గోగువారిగూడెం గ్రామానికి చెందిన విలేకరి వార్త లక్ష్మణ్ సోదరుడు, కాంగ్రెస్ నాయకుడు జంగా వెంకన్న ఇటీవల విద్యుత్ షాక్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి, ఒక చేతిని కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి జంగా వెంకన్న స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని, ప్రమాదానికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జంగా వెంకన్న త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కష్టకాలంలో ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆ స్కూల్‌కు పిల్లలను పంపిస్తున్నారా...జర జాగ్రత్త

**ఫీజుల విషయంలో ఇబ్బందులు పెడుతున్నారంటూ తల్లిదండ్రుల ఆవేదన**




ప్రజాపక్షం/చందంపేట; నల్గొండ జిల్లా చందంపేట మండల పరిసర గ్రామాల నుండి దేవరకొండ లోని డిపిఆర్ స్కూల్‌కు పిల్లలను పంపిస్తున్న తల్లిదండ్రులు ఫీజుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఫీజులు చెల్లించినప్పటికీ బోనఫైడ్, స్టడీ కండక్ట్ సర్టిఫికెట్ల కోసం వెళ్లినప్పుడు ఫీజు బకాయిలు ఉన్నట్లు చూపిస్తూ అదనంగా డబ్బులు చెల్లించాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. సర్టిఫికెట్ల కోసం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు, తల్లిదండ్రులను ఒకసారి ఒక వారం తర్వాత రావాలని తిప్పుతున్నారని చెబుతున్నారు. ఫీజులు పూర్తిగా చెల్లించిన మరల చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.గతంలోనూ పాఠశాలపై ఫిర్యాదులు ఉన్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. పిల్లలను డిపిఆర్ పాఠశాలలో చేర్పించే తల్లిదండ్రులు ముందుగా ఫీజులు, సర్టిఫికెట్ల జారీ విధానం తదితర విషయాలపై పూర్తిగా తెలుసుకొని నిర్ణయం తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు సూచిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించాలని కోరుతున్నారు.



## బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంజయ్య

ప్రజాపక్షం/మునగాల: బిసి సంక్షేమ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బిసి సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు బిసి సేన జిల్లా ప్రధాన కార్యదర్శిగా మునగాల మండల కేంద్రానికి చెందిన నాయిని అంజయ్యను నియమిస్తూ శనివారం బిసి సేన జాతీయ కార్యదర్శి డాక్టర్ నరాల రుక్మారావు, బిసి విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ లు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయిని అంజయ్య మాట్లాడుతూ గ్రామాల్లో కమిటీలు వేసి బిసి ఉద్యమ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. నా నియమకానికి సహకరించిన డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్, పచ్చిపాల రామకృష్ణ యాదవ్, నరాల రుక్మారావు, పొలంపల్లి సుధాకర్‌గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం జిల్లా కార్యదర్శి షేక్ సైదా, చిమట లింగరాజు, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## మహిళ కడుపులోంచి 10 కేజీల కణితి తొలగింపు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: పట్టణంలోని లింగగిరి రోడ్డులో ఉన్న శ్రీ శ్వేత ఆసుపత్రిలో శనివారం డాక్టర్ శ్వేత అట్లూరి, డాక్టర్ జి.సునీల్‌కుమార్ లు మహిళ కడుపులో ఉన్న పది కేజీల కణితిని చికిత్స ద్వారా తొలగించారు. మఠంపల్లి మండలం చెన్నాయిపాలెంకు చెందిన బాణోతు భజిని అనే మహిళ కొన్ని సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం హుజూర్‌నగర్‌లోని శ్రీ శ్వేత ఆసుపత్రికి రాగా వైద్య పరీక్షలు నిర్వహించి కడుపులో కణితిని గుర్తించి మహిళ కడుపులోంచి పది కేజీల కణితిని తొలగించారు. ఇంత క్లిష్టమైన ఆపరేషన్‌ను తక్కువ ఖర్చు తో చేసిన ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్యులకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ

ప్రజాపక్షం/నేరేడుచర్ల: పట్టణంలోని రెండో వార్డులో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను మున్సిపల్ చైర్మన్ కొణత చిన్న వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ యారవ లక్ష్మి శ్రీనివాస్, కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యులు అలక శ్రవణ్‌రెడ్డి, తాళ్ల సురేష్‌రెడ్డి, డీలర్ సైదులు, దిద్దుకుంట్ల పురుషోత్తం రెడ్డి, బెల్లంకొండ శేఖర్, జింజరాల శ్రీను, గజ్జల కోటేశ్వరరావు, కట్ట భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



## మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్



ప్రజాపక్షం/నేరేడుచర్ల: మండలంలోని పత్తేపురం గ్రామంలో రైతు తాటికొండ నారాయణమ్మ వ్యవసాయ క్షేత్రంలో పది ఎకరాల విస్తీర్ణంలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ నాగయ్య, మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి లు మాట్లాడుతూ ఫామ్ అయిల్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం లభిస్తుందని, అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. రైతులు పామ్ అయిల్ సాగుపై అవగాహన పెంచుకుని ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్ఎంఈవోపి పథకం కింద మొదటి నాలుగేళ్లలో తోట నిర్వహణ, అంతర పంటల సాగుకు హెక్టార్‌కు 42వేలు ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు. అలాగే ప్రభుత్వ నిబంధనల మేరకు డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు సబ్సిడీ అందుబాటులో ఉందని వివరించారు. మండలంలో ఫామ్ అయిల్ సాగు విస్తీర్ణాన్ని పెంచి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ల సురేష్‌రెడ్డి, సర్పంచ్ ఆయిల్ ఫెడ్ అసిస్టెంట్ డైరెక్టర్ అలీమ్, తహసిల్దార్ సైదులు, ఎవో షేక్ జావేద్, హార్టికల్చర్ ఆఫీసర్ ప్రదీప్తి, హెచ్ఈవో, ఎఈవో లు నిర్మల, హిమబిందు పాల్గొన్నారు.

## జనసేన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం



ప్రజాపక్షం/నేరేడుచర్ల: పట్టణంలోని శనివారం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సరికొప్పుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హుజూర్‌నగర్ కోఆర్డినేటర్లు యడమ రాజేష్, పసుపుల జయరాం పాల్గొని రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధానం, ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యచరణపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గాదెల శ్రీనివాసరావు మద్దతుగా ప్రతి జన సైనికుడు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కుకు అర్హులైన పట్టభద్రులకు ఓటర్ నమోదుపై అవగాహన కల్పించాలని, యువత ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సరికొప్పుల విజయలక్ష్మి, అందె శ్రీను, సైదులు, కొమ్మరాజు శ్రీను, హసన్ మియా, గోపి, సాయిచరణ్, నరేష్, కీసర మధు, మట్టయ్య, గోపి, వంశీ, మణిబాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.కాసం వెంకటేశ్వర్లు పర్యటన



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట పట్టణంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కర్ణాటక నూతన సహ ప్రభారీగా నియమితులైన డా. కాసం వెంకటేశ్వర్లు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు బీజేపీ నాయకులు డోలు దప్పులతో ఘన స్వాగతం పలికారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఇటీవల విమాన ప్రమాదంలో ఉగ్రదాడికి గురై గాయపడిన పైలట్ స్మిత్ మచ్చర్ ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని కోరుకుంటూ స్వామివారి పాదాల వద్ద పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండపైన స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన ఇండియన్ పైలట్‌కు కనీస మద్దతు ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందని మండిపడ్డా రుయాదగిరిగుట్ట మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై బీజేపీ కౌన్సిలర్లు అద్భుతమైన పోరాటం చేస్తున్నారని డా. కాసం వెంకటేశ్వర్లు ప్రశంసించారు. తక్షణమే మున్సిపాలిటీని ప్రక్షాళన చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపట్టి భారీ పోరాటం చేయాల్సి వస్తుందని అధికారులను, పాలకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్, జిల్లా సెక్రెటరీ కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ, పట్టణ కౌన్సిలర్లు బోడ రాధ, కర్రె మాధవి, మండల అధ్యక్షురాలు గుంటుపల్లి మహేశ్వరి సత్యం, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దయ్యాల కుమార్ పాల్గొన్నారు.

## ఉచిత పోలీసు శిక్షణకు 4వ తేదీన ఎంపిక పరీక్ష

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ఎస్ఐ, కానిస్టేబుల్ పోలీసు ఉద్యోగ నియామకాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 45 రోజుల ఉచిత పోలీసు శిక్షణ శిబిరం నిర్వహించేందుకు నేడు ఎంపిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేడు (ఆదివారం) ఉదయం 10.30 గంటల నుండి 11.00 గంటల వరకు ఎంపిక చేసిన 4 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. దీని కోసం https://suryapet.telangana.gov.in నందు ఉచితంగా దరఖాస్తు చేసుకున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రాల వివరాలు... సూర్యాపేట నియోజక వర్గం అభ్యర్థులు శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో, కోదాడ నియోజక వర్గం అభ్యర్థులు కె.ఆర్.ఆర్ డిగ్రీ కళాశాలలో, హుజూర్‌నగర్ నియోజక వర్గం వారు గ్రీన్‌వుడ్ పాఠశాలలో, తుంగతుర్తి నియోజక వర్గ అభ్యర్థులు తిరుమలగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు సమర్పించిన ఉద్యోగ దరఖాస్తు, ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ దరఖాస్తు, ఆధార్ కార్డును విధిగా తీసుకురావాలని సూచించారు. స్క్రీనింగ్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన 400 మంది అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. సూర్యాపేట కేంద్రంలో 200, కోదాడలో 200 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపక్షం/మునగాల: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఎన్నికలు జరగనున్నందున రాష్ట్ర ఎన్నికల సంఘం సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6వ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తుందని, కావున మండల వ్యాప్తంగా ఉన్న పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల బిఆర్ఎస్ నాయకులు రాజమోహన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు ఎన్నికల కమిషన్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం తమ ఎమ్మెల్సీ ఎన్నికల దరఖాస్తు పత్రాలను స్థానిక తహసిల్దార్ కార్యాలయం, గ్రామ బిఎల్‌వో లకు అందజేయాలని తెలిపారు. 2023 సంవత్సరం నాటికి పట్టభద్రులుగా ఉన్నవారు మాత్రమే ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు అర్హులని కోరారు.

## పుస్తకాలు అందజేత



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ శాఖ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం పుస్తకాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సూచనల మేరకు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, అనూష పర్యవేక్షణలో హుజూర్‌నగర్ తహసిల్దార్ బండి కవిత అభ్యర్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యర్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బచ్చు రామారావు, లైబ్రేరియన్ శ్రీధర్‌రెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ



ప్రజాపక్షం/గరిడేపల్లి: మండలంలోని ఎల్‌బి నగర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన స్మార్ట్ రేషన్‌కార్డులను సర్పంచ్ బోధ సైదిరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. శనివారం గ్రామ పంచాయతీలో నూతన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పారదర్శకంగా ప్రవేశపెట్టిన ఈ నూతన స్మార్ట్ రేషన్‌కార్డుల ద్వారా అర్హులైన పేదలకు ఆహార భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఉప సర్పంచ్ నాగమ్మ, వార్డు మెంబర్ జానయ్య, రేషన్ డీలర్ శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాపక్షం/నడిగూడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ఉచితంగా రూపొందించిన రాజనీతి శాస్త్ర స్టడీ మెటీరియల్‌ను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి సులోచనరాణి శనివారం ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ పుస్తకాలను రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కొల్లు శ్రీనివాస్ స్వయంగా రూపొందించి విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా డిఐఈవో సులోచనరాణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ఈ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయనాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** రైతులు పండించిన పంట కొనుగోలు చేసేందుకు త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పిఎసిఎస్ చైర్మన్ ఫోటోల శ్యామ్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని వెంకిర్యాల పల్లెగూడెం గ్రామాల్లో రైతుల ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వారు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని దళారుల వద్దకు వెళ్లి రైతులు మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పల్లెగూడెం సర్పంచ్ అప్పి రెడ్డి బలరాం రెడ్డి, డైరెక్టర్లు గండు బసవయ్య యాదవ్, చింతల శ్రీనివాస్ రెడ్డి, ఉప్పలంచి శ్రీకాంత్, అంబెపు బాలరాజు, నాయకులు చింతల లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా మహేష్ గౌడ్

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా బొమ్మలరామారం మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన బైరగోని మహేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మహేష్ గౌడ్కు అభినందనలు తెలిపారు.పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఓబీసీ మోర్చాను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి మహేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్, పాశం భాస్కర్, దుర్గాపతి లక్ష్మి నారాయణ, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు రామచందర్, కవిటికారి కృష్ణ, జిల్లా నాయకులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం ఖైతాపురం,ఎల్లగిరి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఆయా పాఠశాలల్లోని 260 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.అదేవిధంగా రూ.1,66,088విలువైన నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎల్లగిరి గ్రామ సర్పంచ్ రిక్కల మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు దివిస్ పరిశ్రమ అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయంత్‌కుమార్,నరేష్,ఎపిపిసి చైర్మన్ సుమలత,పంచాయతీ కార్యదర్శి బ్రహ్మణీ,ప్రధానోపాధ్యాయులు విజయమ్మ, అనిత,జె,కోటేశ్వర్‌రావు,దివిస్ ప్రతినిధులు బి.గోపి, జి.వెంకటేశ్వర్లు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పోషణ మాసం

**ప్రజాపక్షం/డిండి;** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మాసంలో భాగంగా శనివారం కే.గౌరారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ వార్డు సభ్యులు దర్శనం విష్ణు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని, పోషకాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యకరమైన జీవనం గడపాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఎన్‌ఎం అరుణ, అంగన్‌వాడీ టీచర్ జయలక్ష్మి, ఆశా కరుణ, గర్భిణిలు, బాలింతలు ప్రజలు పాల్గొన్నారు.

## శాసనసభ్యులకు ఆహ్వాన పత్రిక అందజేత



**ప్రజాపక్షం/రామన్నపేట :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయిన తెలంగాణలో దివ్యాంగుల సమస్యలు పరిష్కారం కావడంలేదని అందుకోసమే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సెమినార్ ఏర్పాటు చేస్తున్నామని,విశ్వవిద్యాలయాల ఫోరం దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షులు ఎన్.అశోక్ తెలిపారు. దివ్యాంగుల కోసం ఏర్పాటైన దివ్యాంగుల హక్కుల చట్టం2016 అమలు కోసం మేధావులతో ప్రొఫెసర్లతో రాజకీయ నాయకులతో విద్యార్థి సంఘ నాయకులతో దివ్యాంగుల సంఘ నాయకులతో సదస్సు ఏర్పాటు చేస్తున్నామని, ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం సెమినార్ కు హాజరై దివ్యాంగులు ఎదుర్కొనే సమస్యలు రానున్న రోజులలో వారికి ఉపయోగపడే అంశాలు మాట్లాడాలని ఎమ్మెల్యే వీరేశమును విశ్వవిద్యాలయాల ఫోరం దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షులు కోరారు. రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వీరేశం దృష్టికి తెలియపరిచారు. దివ్యాంగుల కొరకు ఏర్పడిన చట్టం అమలు కావడం లేదని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలని దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం విప్ గా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయాలని దివ్యాంగుల ఫోరం కోరింది. అందుకు ప్రభుత్వ విప్ సానుకూలంగా స్పందించి సమావేశానికి హాజరై దివ్యాంగుల సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి నాగేశ్వర్ పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

### డిసిఎంను ఢీకొట్టిన కారు,ఒకరు మృతి,ఇద్దరికి గాయాలు

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** జాతీయ రహదారి65పై అతివేగం వెళ్తు ఎటువంటి సిగ్నల్ వేయకుండా టర్న్ అవుతున్న డిసిఎంను వెనక నుండి కారు ఢీకొట్టిన సంఘటన చౌటుప్పల్ మండలం తుఫ్రాన్‌పేట సమీపంలోని ఓ హోటల్ ఎదుట శనివారం తెల్లవారుజామున జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన కాడింగు యాదగిరి(26),రాచకొండ గణేష్(28),కొరివి జగదీష్ లు చేపల వ్యాపారం పనిలో భాగంగా ఖమ్మం నుండి హైద్రాబాద్‌కు కారులో వెళ్తున్నారు.ఈ క్రమంలో మండలంలోని తుఫ్రాన్‌పేట గ్రామ పరిధిలోని రంగమ్మగారి కిచెన్ హటల్ ఎదురుగా హైద్రాబాద్ వైపు వెళ్తున్న ఓ డిసిఎం డ్రైవర్ ఎలాంటి సిగ్నల్ వేయకుండా డిసిఎం ను ఎడమ వైపు నుండి కుడి వైపుకు మళ్ళించడంతో డిసిఎం వెనకాల వస్తున్న కారు డిసిఎం ను వెనక నుండి బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు.గాయపడిన వారిని చికిత్స కోసం హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యాదగిరి మృతి చెందగా,మిగిలిన ఇద్దరు గాయాలతో చికిత్స పొందుతున్నారు.ఈ ఘటనపై మృతుడి తండ్రి కారింగు ఉప్పలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ జి.మన్మథకుమార్ తెలిపారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదును వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను ప్రతి గ్రామంలో, ప్రతి మండలంలో పెద్ద ఎత్తున చేపట్టి వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి, మాడుగులపల్లి మండలాలకు సంబంధించిన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని పార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసి మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియలో పట్టభద్రులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూసేందుకు మిర్యాలగూడ రెడ్డి కాలనీలోని కార్యాలయంలో ఇద్దరు ప్రత్యేక డేటా ఎంట్రీ ఆపరేటర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, ఎండి.యూసుఫ్, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, ధనావత్ చిట్టిబాబునాయక్, బైరం సంపత్, అంగోతు హతిరాం నాయక్, కుందూరు వీరకోటి రెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, ధనావత్ బాలాజీనాయక్, కుర్ర సేవ్యానాయక్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ ఇవ్వక పోతే తీవ్ర పరిణామాలు తప్పవు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** రైతులకు నిరంతర నాణ్యమైన విద్యుత్ ఇవ్వక పోతే తీవ్ర పరిణామాలు తప్పవని పోచంపల్లి బిఆర్ఎస్ ముఖ్యనాయకులు మండల ,పట్టణ పార్టీ అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి సీత వెంకటేషం మాజి ఎంపిపి మాడుగుల ప్రభాకర్ రెడ్డి వైస్ ఎంపిపి పాక వెంకటేష్ యాదవ్ పిఎసిఎస్ మాజి చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి లు తీవ్రంగా హెచ్చరించారు.నిత్యం కరెంట్ కోతలతో వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగించే రైతులకు పంట నష్టం జరుగుతున్న నేపథ్యంలో శనివారం పోచంపల్లి పట్టణ సమీపంలోని జలాల్ పురం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆ పార్టీ నాయకులు గంట పాటు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజి ఎంపిపి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 24గంటలు ఉచిత కరెంట్ సరఫరా చేసి రికార్డు స్థాయిలో పంట దిగుబడి సాధించామని గుర్తుచేశారు.కరెంట్ కోతలతో రైతుల కళ్ళల్లో కన్నీళ్లు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిభిరం

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** అక్షర ఫౌండేషన్ సూర్యాపేట, శంకర కంటి ఆసుపత్రి హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సంకినేని కమలమ్మ రామారావు జ్ఞాపకార్థం ఎస్.కె.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో నేడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్ రావు, తుంగతుర్తి గ్రామ సర్పంచ్ సాయిబాబా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిభిరంలో అన్ని రకాల కంటి సమస్యలు చూడపడుతాయన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయబడుతాయని తెలిపారు. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిభిరానికి వచ్చే వారు తమ ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. వైద్య శిభిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు చూడబడుతుందని, ఇతర వివరాలకు డి. సాయి కుమార్ సెల్. 7036259911 సంప్రదించాలని కోరారు.

## అటకెక్కిన కాంగ్రెస్ హామీలు...



**ప్రజాపక్షం/దేవరకొండ;** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ఇచ్చిన హామీలను అటకెక్కించి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతుందని దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో విసిగి వేసారుతున్న ప్రజలు బిఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని శనివారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో డిండి మండలం నగారదుబ్బతండాకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీని వీడి మాజీ ఎంఎల్‌ఏ రవీంద్రకుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, సినియర్ నాయకులు రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిన్న బాలరాజు డిమాండ్ చేశారు.చౌటుప్పల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.గ్రామ పంచాయతీల్లో నిధులు లేక అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు కరెంట్ బిల్లుల కోసం సరిపోతున్నాయని తెలిపారు.గ్రామాల్లో పారదర్శకంగా నిధులు ఖర్చు చేయాలనే ఉద్దేశ్యంతో సర్పంచ్,ఉపసర్పంచ్ లకు ఇచ్చిన జాయింట్ చెక్‌పవర్‌పై ప్రభుత్వం ఆంక్షలు పెట్టడం సరికాదని అన్నారు.సర్పంచ్‌లు అవినితి చేసేలా 7 రోజుల నిబంధన ఉందని వివరించారు.రాజ్యాంగబద్ధంగా కల్పించిన చెక్‌పవర్‌ను నిర్వీర్యం చేయవద్ద ని కోరారు.అదే విధంగా ఉప సర్పంచ్‌లకు గౌరవ వేతనం రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## దశదినకర్మలో బిఆర్ఎస్ నాయకులు

**ప్రజాపక్షం/రామన్నపేటః** మండల పరిధిలోని ఇస్కిల్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పైళ్ల ప్రతాపరెడ్డి దశదినకర్మ శనివారం తన స్వగృహంలో జరగగా పార్టీ నాయకులు పాల్గొని పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ సర్పంచ్ బందెల యాదయ్య, నాయకులు పైల్ల వెంకటరెడ్డి,కోళ్ల కిషన్,సుర్కంటి నరసింహారెడ్డి, జెట్టి శివప్రసాద్, చొప్పరి నరసింహ,ఆవుల శ్రీధర్, కావటి లింగయ్య,పోషబోయిన భద్రయ్య,దడిపల్లి మహేష్, ఎడ్ల సురేష్,పోతుల స్వామి, కొండగడప చింటూ, సుర్వి సతీష్,సుర్కంటి నరేందర్ రెడ్డి,పోషబోయిన శేఖర్,జడల శాంతి,పబ్బు సాయి,ఉపేందర్ పాల్గొన్నారు.



## 5న కామ్రేడ్ బందగి సంస్మరణ సభ

**ప్రజాపక్షం/డిండి;** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రైతు సంఘం జిల్లా అద్యక్షులు ఎండి. మైనోద్దీన్ తన యుడు అమరజీవి కామ్రేడ్ బందగి సెప్టెంబర్ 02న రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఈనెల 5న సోమవారం కామ్రేడ్ బంధగి 41వ రోజు సంస్మరణ సభ కందుకూరు గ్రామంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ సంస్మరణ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్ఏ పల్లా వెంకట్‌రెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి తోపాటు రాష్ట్ర, జిల్లా కమ్యూనిస్టు పార్టీ నేతలు హాజరు కానున్నారు. ఈ సంస్మరణ సభలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, బంధువులు, ప్రజలు పాల్గొనాలని మైనోద్దీన్ శనివారం తెలిపారు.

## శాస్త్రీయ దృక్పథంతోనే సమాజ పురోగతి



**ప్రజా పక్షం/నకిరేకల్:** ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ద్వారానే సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్,జిల్లా కార్యదర్శి గంగాధర్ భద్రయ్య ఎమ్మెల్యేను కలిసి సభ్యత్వ రశీదును అందజేశారు.జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) తెలంగాణ సభ్యత్వాన్ని ఆయన స్వీకరించారు.ఈ సందర్భంగా జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, అంధ విశ్వాసాల నిర్మూలనకు చేపడుతున్న ప్రచారాన్ని వివరించారు.జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

## కంది పంటపై పొలంబడి

**ప్రజాపక్షం/నాంపల్లి** :మండల పరిధిలోని దేవత్‌పల్లిలో వ్యవసాయ శాఖ,ఆత్మ ఆధ్వర్యంలో శనివారం కంది పంటపై పొలంబడి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మునుగోడు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.వేణుగోపాల్ హాజరై మాట్లాడుతూ రైతులు ఆధునిక యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా కంది పంటలో పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.పర్యావరణహిత పద్ధతుల్లో పురుగు, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం నాంపల్లి మండల వ్యవసాయ అధికారి బి.శివ మాట్లాడుతూ కంది పంటలో పురుగుల నివారణకు లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాల ఏర్పాటు,అంతర పంటల సాగు ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గణేష్, బీటీఎం రమేష్,దేవత్‌పల్లి గ్రామ సర్పంచ్ ముదిగొండ ఏసు,ఉప సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

## కార్పెంటర్ సంఘం అధ్యక్షుడిగా నరేందర్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కొండమల్లేపల్లి మండల విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ సంఘం మండల అధ్యక్షుడిగా పసునూరి నరేంద్రచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పోలోజు మల్లేష్ చారి ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నరేంద్రచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ల కార్మికుల సమస్యల కోసం కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా మనుమయ సంఘం ఉపాధ్యక్షులు సోనగంటి గోవర్ధనా చారి, సల్లోజు శ్రీనివాస చారి, ఐఎన్‌టీయూసి జిల్లా కార్యదర్శి నారోజు సైదాచారి, గౌరవ అధ్యక్షులు కర్నెకంటి జంగాచారి, చెన్నయ్యచారి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన డీఎల్ఎస్‌సీ సమావేశంలో మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రజలతో పాటు ,పశువులకు కూడా నీటి కొరత లేకుండా అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు.జిల్లాలో నిర్మిస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌తో పాటు,తాగు నీటి ట్యాంకులు,ఇతర ఇంజినీరింగ్ పనులను వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి మట్టాలు తగ్గిన సమయంలో ఇసుక లభ్యతకు అవకాశం ఉన్నందున ఇసుక అవసరమైన పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇసుక అవసరమైన పాఠశాలలు, ఇంజినీరింగ్ పనులు,ఇతర శాఖలకు సంబంధించి అవసరమైన అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,జిల్లా మైనింగ్ ఏడి రవికుమార్, అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ఎస్‌పిఆర్ హైస్కూల్ యాజమాన్యంపై డిఇఒ ఆగ్రహం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : 45 రోజులు గడిచినా పేరు మార్పు ప్రతిపాదనలు సమర్పించకపోవడంపై ఎస్‌పిఆర్ హైస్కూల్ యాజమాన్యంపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారని రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు,జాతీయ అధ్యక్షుడు కేతావత్ బాబూరామ్ నాయక్,జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల వినోదాచారి తెలిపారు.వారు మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డు,కొండమల్లేపల్లిలో సర్వేపల్లి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్‌పిఆర్ హైస్కూల్ అక్రమ నిర్వహణపై జిల్లా కలెక్టర్,విద్యాశాఖాధికారి పి.సుశీంద్ర రావుకు వినతిపత్రం సమర్పించామన్నారు.ఆర్‌టిఐఎస్ఎస్ సమర్పించిన ఆధారాలతో జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రొసీడింగ్స్‌ను సెప్టెంబర్ 29న విడుదల చేశారన్నారు.విద్యాశాఖ ఎస్‌పిఆర్ పదం లేకుండా నూతన పేరుకు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించినా 45 రోజుల గడువు ముగిసినా యాజమాన్యం స్పందించలేదని డీఈవో తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు.కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ తరగతులు నడపడం, కొత్త ప్రవేశాలు చేపట్టడం ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం నేరమన్నారు.అంతేకాకుండా కొండమల్లేపల్లి క్యాంపస్ చెరువు బఫర్ జోన్ ముంపు ప్రాంతంలో అక్రమంగా నిర్మించారని,అగ్నిమాపక అనుమతులు లేకుండా బాలుర హాస్టల్ నడుపుతున్నారని ఆరోపించారు.తల్లిదండ్రులు ఇలాంటి వివాదాస్పద సంస్థల్లో పిల్లలను చేర్పించి మోసపోవద్దని,పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

## బ్రాహ్మణ గౌరారంలో డిజిటల్ సర్వే పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/నాంపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వేలో భాగంగా నాంపల్లి మండల పరిధిలోని బ్రాహ్మణ గౌరారం గ్రామంలో శనివారం డిజిటల్ సర్వే పనులు ప్రారంభమయ్యాయి. ఆర్‌డిఓ శ్రీదేవి సర్వే ప్రక్రియను సందర్శించారు.దశాబ్దాల క్రితం నాటి పాత రెవెన్యూ రికార్డులు,సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆమె తెలిపారు. గ్రామ సరిహద్దులు,ప్రభుత్వ భూములు, రైతుల భూములను రైతుల సమక్షంలోనే కొలిచి రికార్డుల్లో నమోదు చేస్తామన్నారు. రైతులు పాత పహాణీలు,పాస్ పుస్తకాలు,రిజిస్ట్రేషన్ పత్రాలతో సర్వే బృందానికి సహకరించాలని కోరారు.నాంపల్లి తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, మండల సర్వేయర్ రాణా ప్రతాప్ సింగ్, వడ్డేపల్లి సర్పంచ్ జంపాల లక్ష్మీ సైదులు,ఉప సర్పంచ్ బుషిపాక యాదయ్య,జీపీఓ శేఖర్, ప్రైవేట్ సర్వేయర్లు జడ ప్రశాంత్,శంకర్, దానయ్య,రైతులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని తీర్మానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామపంచాయతీ ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శనివారం మిర్యాలగూడ మండలం జంకుతండా గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేరావత్ చిన ధనమ్మ, వార్డు సభ్యులు మాట్లాడారు. గ్రామంలోని బెల్టు షాపుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా రాత్రంతా మద్యం విక్రయాలు జరుపుతుండటంతో మద్యం సేవించిన వ్యక్తులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ మహిళలు, గ్రామ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో తాగుబోతులు వీధుల్లో సంచరిస్తూ బాటసారులను, మహిళలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సంబంధిత ఎక్సైజ్, పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి జంకుతండాలోని బెల్టు షాపులపై క్షేత్రస్థాయి విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు రాజన్న, రమేష్, బుజ్జి, రామారావు, చరణ్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఆర్‌టిసి ఎన్నికల్లో ఐక్యకూటమికి మద్దతివ్వాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆర్‌టిసి ఎన్నికల్లో ఐక్యకూటమికి కార్మికులు మద్దతివ్వాలని జెఏసి టిఎంయు జనరల్ సెక్రటరీ థామస్ రెడ్డి, ఈయు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ బాబు, ఎన్ఎంయు డిప్యూటి సెక్రటరీ ఎండి రహీముద్దీన్‌లు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని డిపో ఎదుట జెఏసి కన్వీనర్ పిండిగ వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో యూనియన్లు లేక కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డిపోల వారీగా కార్మికులను ఏకం చేసి సమ్మె నోటీసు ఇవ్వడంతోపాటు మూడు రోజుల సమ్మె నిర్వహించినట్లు చెప్పారు. సమ్మె సందర్భంగా ప్రభుత్వం, యాజమాన్యంతో చర్చలు జరిపి 32 డిమాండ్ల పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రభుత్వ జోక్యం లేకుండా కార్మికులు స్వేచ్ఛగా ఈనెల 9న జరిగే ఎన్నికలో తమ ఓటు హక్కును వినియోగించుకునే సంఘాన్ని గెలిపించుకోవాలని కోరారు. ఈ ఎన్నికలు కార్మికుల భవిష్యత్తుకు సంబంధించినవని, ప్రతి కార్మికుడు ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు, ఆర్‌టిసి కార్మికులు పాల్గొన్నారు.

## సాంకేతికతను ఒడిసిపట్టుకోవాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఫోటోగ్రఫీ రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పులకు అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు నూతన సాంకేతికతను ఒడిసిపట్టుకుంటూ ముందుకు సాగాలని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. శనివారం నకిరేకల్ నుంచి ఫోటో ఎక్స్‌పోఁకు బయలుదేరుతున్న ఫోటోగ్రాఫర్ల ప్రత్యేక బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫోటోగ్రఫీ రంగం రోజురోజుకూ ఆధునికీకరణ చెందుతోందని పేర్కొన్నారు.మారుతున్న కాలానికి తగినట్లుగా సరికొత్త సాంకేతిక మెళకువలను నేర్చుకోవడం వల్ల రంగంలో రాణించడమే కాకుండా, మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి, వారి సమస్యల శాశ్వత పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఫోటో,వీడియోగ్రాఫర్స్ సొసైటీ నాయకులు,స్థానిక ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ చైతన్యానికి ‘సమ్మర్ నైట్స్’



**ప్రజాపక్షం/నకిరేకల్:** పర్యావరణ పరిరక్షణ,ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించేలా కేతేపల్లి మండలం ఇనుపాముల ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు,రచయిత గెండెల శ్రీనివాసు రచించిన సమ్మర్ నైట్స్ పుస్తకాన్ని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శాసనసభ్యుల వినోద కేంద్రంలో ఆవిష్కరించారు.కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ వ్యవస్థాపకుడు కె.లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం తొలి కమిషనర్ దిలీప్‌రెడ్డి, విద్యావేత్త ప్రొఫసర్ ఉపేందర్‌రెడ్డి,ప్రజా విధాన నిపుణుడు దొంతి నరసింహారెడ్డి, రాష్ట్ర సమన్వయకర్త యనాల వెంకట్‌రెడ్డి,పాఠ్యపుస్తక రచయిత రమేష్‌రావు,పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం అమ్మ ఒడి లాంటిది

**ప్రజాపక్షం/వేములపల్లి:** అంగన్వాడి కేంద్రం అమ్మ ఒడి లాంటిదని ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ సుచరిత అన్నారు,శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో 9వ పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా ఎంపీడీవో జ్యోతి తహసీల్దార్ హేమలతతో ఎస్ఐ వెంకటేశ్వర్లు తో కలిసి పాల్గొన్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్రమ దత్తతలకు పాల్పడితే పోలీసులకు తెలియజేయాలని వాటిపై కఠినంగా శిక్షలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్,ఎంపీఓ లలిత,ఏపీవో శ్రీనివాసరెడ్డి,సూపర్వైజర్ పరిమి రజిని,పోషణ అభియాన్ బీసీ రమణి,హెల్త్ సూపర్వైజర్ శాంత,ఏఎన్ఎం శైలజ,అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.